# కృష్ణా జలాల ట్రిబ్యునల్‌పైన

# చర్చ

కృష్ణానదీ జలాల వినియోగంపైన కొత్త ట్రిబ్యునల్ రానుంది. కృష్ణానదీ పరీవాహక రాష్ట్రాలయిన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలు తమ డిమాండ్లు, ఫిర్యాదులూ ఆ ట్రిబ్యునల్ ముందు ఉంచి పరిష్కారం కోరబోతాయి. ట్రిబ్యునల్ ఇవ్వబోయే అవార్డు ఇంకొక ముప్పై ఏళ్ళో నలభై ఏళ్ళో అమలులో ఉండబోతుంది.

కృష్ణానదీ జలాలు తప్ప వేరే గత్యంతరం లేని కరువు జిల్లాలు మన రాష్ట్రంలో మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా రాబోయే కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు ఏ వైఖరి అవలంబించబోతుందనేది ఆ ప్రజలందరి సమస్య. ప్రభుత్వం సంప్రదించిన ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క అభిప్రాయం చెప్పడమే కాక, కృష్ణానదీ జలాల సమస్యను అధ్యయనం చేసిన మేధావులు కూడా రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అభిప్రాయాలన్నిటినీ విని, చర్చించడం కోసం ఈ సెమినార్ నిర్వహిస్తున్నాం.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ఇప్పటికే తుది రూపం తీసుకుంది. కాబట్టి దాని గురించి నాలుగు మాటలు చెప్పి, మా ప్రతిపాదన వివరించి మిమ్మల్ని సెమినార్‌కు ఆహ్వానిస్తాము.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలలో ఒకటి సమంజసమయినదే. మూడు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకం అంటూ జరిగిన తరువాత, దాని అమలు గురించి నిత్యం ఒకరినొకరు తిట్టుకుంటూ జనాన్ని రెచ్చగొట్టుకుంటూ సంకుచిత ప్రయోజనాలు పొందజూసే బదులు దాని పర్యవేక్షణకు నిష్పాక్షికమైన వ్యవస్థను నెలకొల్పడం ఉచితంగా ఉంటుంది. అది రివర్ వ్యాలీ అథారిటీ రూపంలోనయినా ఉండవచ్చు, వేరే ఏ ఉచితమైన రూపంలోనయినా ఉండవచ్చు.

మిగిలిన ప్రతిపాదనలు కర్నాటక, మహారాష్ట్రలు కృష్ణానదీ జలాలలో తమ వాటాను మించి వినియోగించుకోకుండా ఉండగలందుకు ఆంక్షలు పెట్టే ప్రతిపాదనలు. ఒక్కొక్క రిజర్వాయిర్ నుండి పారించుకోవడానికి అనుమతి గల నీటిలో 2/3వ వంతు కంటె ఎక్కువ రిజర్వాయిర్‌లో నిలువ ఉంచుకోకూడదనీ, ఒక సబ్ బేసిన్ నుండి మరొక సబ్ బేసిన్‌కు నీటి కేటాయింపును బదలాయింపు చేసుకోకూడదనీ మన ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

ఒక రిజర్వాయిర్‌లో ఎంత నీరు నిలువ ఉంచుకుంటే ఎంత నీరు పారించుకోవచ్చుననే దానికి సార్వత్రికమైన ప్రమాణమేదీ లేదు. గంగానది లాగా నిత్యం ప్రవహించే నది అయితే అతి చిన్న రిజర్వాయిర్‌తోనయినా పుష్కలంగా నీరు పారించుకోవచ్చు. వర్షాధార ప్రాంతంలో ప్రవహించే నది అయితే ఎక్కువ ఉంచుకోవలసి ఉంటుంది. 2/3 అనే నిష్పత్తి సార్వత్రికంగా సరిపోతుందని మన ప్రభుత్వానికి ఎవరు చెప్పారు? ఎక్కువ నిలువ ఉంచుకొని వారి వాటా కంటె ఎక్కువ వాడుకుంటున్నారన్న అనుమానం ఉంటే రివర్ వ్యాలీ అథారిటీ వంటి పర్యవేక్షక యంత్రాంగం దానికి పరిష్కారం కాగలదు గానీ ఇటువంటి అహేతుకమైన పరిమితులు కాదు. ఇక ఒక సబ్ బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నీటిని మరొక సబ్‌బేసిన్‌లోని ప్రాజెక్టులకు బదలాయించకూడదన్న నియమం - మాకు అర్థమయినంతవరకు - దుర్మార్గమైన ఆలోచన. కృష్ణానదీ నీటిలో కోస్తా జిల్లాలు వాడుకుంటున్న దానిలో గణనీయమైన భాగాన్ని నది ఎగువన ఉన్న దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు బదలాయించనిదే ఆ జిల్లాల కరువు సమస్య తీరదనేది అందరూ ఎరిగిన సత్యం (ఎరిగినట్టు బయటకు ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా)

ఇంకొక ప్రతిపాదన అతి తెలివి ప్రతిపాదన. కర్నాటక, మహారాష్ట్రలు బచావత్ అవార్డు గడువు ముగిసే నాటికి (అంటే 2000 సంవత్సరం మే నెల 31 నాటికి) వారి వాటలో ఎంత వాడుకొని ఉంటే అంతే వారి హక్కని ప్రకటించి, ఆ పైన మిగిలివున్న నీటిని మళ్ళీ మూడు రాష్ట్రాలకూ పంచాలని మన వాళ్ళు అంటున్నారు. అంటే నీకిచ్చింది నువ్వు వాడుకోకపోతే అది నాకు చెందుతుందని దబాయింపు. మనందరి తరఫున మన ప్రభుత్వం ఈ మాటలు మాట్లాడుతున్నందుకు మనమంతా సిగ్గు పడాలి.

ఇంకొక అతి తెలివి ప్రతిపాదన కూడా మన ప్రభుత్వం పెడుతున్నది. ఒక వైపు మిగులు జలాలపైన పూర్తి హక్కు (ప్రాజెక్టులు కట్టుకునే హక్కుతో సహా) మనకే ఉండాలని అడుగుతూ, అదే సమయంలో ఎగువన ఉన్న కర్నాటక, మహారాష్ట్రలు తమ హక్కు మేరకు నీళ్ళు నింపుకున్నాకనే మనకు నీళ్ళు వదిలే పద్ధతి విడిచిపెట్టి వచ్చిన నీళ్ళలో మన వాటాను వచ్చింది వచ్చినట్టు కిందికి రానివ్వాలంటున్నారు. ఇవి రెండూ ఏక సమయంలో సాధ్యమా? పై వాళ్ళు తమ కోటా మేరకు పూర్తిగా నింపుకున్నాకనే కిందికి నీళ్ళు వదిలేటట్టయితే, అందరి కేటాయింపులనూ మించి ప్రవహించే నీరేదయినా ఉంటే దానిని కింది రాష్ట్రం వాడుకోవడం ఉచితంగా ఉంటుందనీ, ఎప్పటికప్పుడు నదిలోకి వచ్చిన నీటిని కింది వాళ్ళ వాటా మేరకు కిందికి విడిచిపెట్టేటట్టయితే, అందరి కేటాయింపులనూ మించి ప్రవహించే నీటి మీద అందరికీ

వాడకపు హక్కు ఇవ్వడం ఉచితంగా ఉంటుందనీ జస్టిస్ బచావత్ భావించారు. ఈ తర్కంలో తప్పేమీ లేదు. రెండు స్కీములలోని అనుకూల అంశాలను కలిపి కొత్త స్కీము తయారుచేసి ప్రతిపాదించడం ప్రజలను మభ్యపెట్టడానికే తప్ప ఇంక దేనికీ పనికి రాదు.

అయితే మన ప్రభుత్వం ప్రతిపాదనల 'ఫ్రేంవర్క్'లోనే లోపం ఉంది. 'ముందు కర్నాటకతో ఐక్యంగా కొట్లాడుదాం, ఆ తరువాత మన అంతర్గత విభేదాలు పరిష్కరించుకుందాం' అని మన ప్రభుత్వం అంటున్నది. కానీ టిఆర్ఎస్ వారు అన్నట్టు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకూ కర్నాటకతో ఒకేరకమైన విభేదం ఉందని ఎందుకనుకోవాలి?

అంతేకాక, అంతర్గత విభేదాల పరిష్కారాన్ని గురించి ఒక నిర్ణయం తీసుకున్నాకనే ట్రిబ్యునల్ ముందు ఏ ప్రతిపాదన పెట్టాలో నిర్ణయించుకోగలము. ముందు ట్రిబ్యునల్‌కు పోయి కర్నాటకను కట్టు దిట్టంచేసి మిగులు జలాలపైన కూడా హక్కు పొందుదాం, ఆ తరువాత మనం మన విభేధాలు పరిష్కరించుకుందాం. అంటే పరిష్కరించుకోవడానికీ ఎంచుకోవడానికీ మిగులు జలాలు మాత్రమే ఉంటాయి. దక్షిణ తెలంగాణ, రాయసీమ జిల్లాల ముఖాన ఆ మిగులు జలాలు కొట్టి, 'తన్నుకు చావండి' అనబోతారు. ఈ మధ్య కాలంలో ఈ రెండు ప్రాంతాల నాయకులు చేస్తున్న ప్రకటనలు చూస్తే తన్నుకు చావడం తథ్యం అని అర్థం అవుతుంది.

దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు కృష్ణానది నీటికి సంబంధించి అనేక హామీలు దశాబ్దాలుగా ఇస్తున్నారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకూ, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకూ శ్రీబాగ్ ఒప్పందంలోనూ పెద్ద మనుషుల ఒడంబడికలోనూ ఉన్న ఈ హామీయే ప్రాతిపదిక. యాభై ఏళ్ళుగా ఈ హామీలు పునాదిరాళ్ళయ్యాయి, పైలాన్‌లు అయ్యాయి. అంతే తప్ప అవి ప్రాజెక్టులు కాలేదు.

ఇవి వర్షాభావ ప్రాంతాలు కాబట్టి, వీటికి అందరి హక్కులూ పోను మిగిలిన జలాలు కాక కచ్చితమైన నికర జలాలు కేటాయించాలి. అది జరగాలంటే సర్కార్ జిల్లాలు కృష్ణా జలాలలో వాడుకుంటున్న వాటాను గణనీయంగా తగ్గించి శ్రీ శైలంలోనూ దానికి ఎగువన మహబూబ్‌నగర్ భూభాగంలోనూ నిలుపుకోవాలి (టిఆర్ఎస్ వారు సూచించినట్టు ఆల్మట్టిలోనూ కొంత భాగం నిలపుకొని మహబూబ్‌నగర్‌కు పారించుకోవచ్చు).

దశాబ్దాలుగా హామీలిచ్చిన ఈ ప్రాజెక్టులకు నెలవయిన నల్గొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రతినిధులతో 2002 సంవత్సరం జనవరి 21న గద్వాల పట్టణంలో జరిగిన ఒక సెమినార్‌లో, ఈ అవగాహనతో కృషి చేయడానికి కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పడింది. హామీ యిచ్చిన అన్ని ప్రాజెక్టులకూ ముందు నికర జలాలు పునఃపంపిణీ చేసి ఆ పైన ట్రిబ్యునల్ ఎదుట మన రాష్ట్రం వైఖరిని నిర్ణయించుకోవాలనీ, దానికోసం హామీ యిచ్చిన ప్రాజెక్టుల కోసం ఆందోళన చేస్తున్న ఉద్యమకారులను సంప్రదించాలనీ ప్రభుత్వానికి సూచిస్తూ ఒక లేఖ రాసాము.

మాకొక అభిప్రాయం ఉన్నట్టే అన్ని పార్టీలకూ, అందరు నిపుణులకూ తలా ఒక అభిప్రాయం ఉంది. ఈ అభిప్రాయాల మధ్య చర్చ, సంవాదం జరగడం అవసరం అని మేము భావిస్తున్నాం. అందుకోసం నిర్వహిస్తున్న సెమినార్‌కు అందరూ హాజరై న్యాయమైన నీటి హక్కు సాధనకు తోడ్పడతారని ఆశిస్తున్నాం.

## సెమినార్

**నవంబర్ 17, ఆదివారం, ఉ॥ 10-00 నుండి సాయంత్రం 5 గం॥ వరకు**

**స్థలం సుందరయ్య విజ్ఞాన కేంద్రం,** బాగ్ లింగంపల్లి.

**శ్రీయుతులు ఆర్. విద్యాసాగర్‌రావుగారు**

(రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్, సెంట్రల్ వాటర్ కమీషన్ సభ్యులు)

**ఎం. శ్రీరాంరెడ్డి గారు**

(రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్)

రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడతారు. చర్చ ఉంటుంది.

**కృష్ణా నదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం**

**Movement for Redistribution of Krishna River Waters**